క్లుప్తంగా

నేడు హుండీల లెక్కింపు

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలను నేడు (మంగళవారం) లెక్కించనున్నట్లు ఈఓ మహేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

19న ఏకసభ్య కమిషన్ పర్యటన

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 19న హనుమకొండలో ఎస్సీ వర్గీకరణ ఏక సభ్య కమిషన్ పర్యటించనున్నట్లు జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీత ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ శమీమ్ అక్తర్ షెడ్యూల్డ్ కులాల ప్రతినిధుల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులముల ఉప వర్గీకరణపై బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమకొండలో జరిగే సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని సూచించారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో ఉపాధిహామీ పథకం కింద 01-04-2023 నుంచి 31-03-2024 వరకు కూలీల ద్వారా చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ చేయడానికి స్టేట్ రిసోర్స్ పర్సన్ నాగరాజు ఆధ్వర్యంలో తనిఖీ బృందం వచ్చినట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. వివిధ గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది ఆడిట్ బృందానికి ఖర్చుల రికార్డులు పూర్తిస్థాయిలో అప్పగించడం జరుగుతుందన్నారు. అనంతరం మండలంలోని గ్రామాలలో ఆడిట్ బృందం మూడు రోజులు పనులను ప్రత్యక్షంగా తనిఖీ చేసి రికార్డులను సరి చూడడం, అవకతవకలను గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. గుర్తించిన అవకతవకలను ప్రజా వేదికలో చదివి వినిపించి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలకు ప్రజా వేదిక ప్రెసిడెంట్ అధికారి సిఫారసు చేస్తారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వాజేడు/వెంకటాపురం(కె): వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో నేడు(మంగళవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వెంకటాపురం(కె) ఏడీఈ ఆకిటి స్వామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంకటాపురం(కె)లోని 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లో పవర్ ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతు పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండల కమిటీ ఎన్నిక



కన్నాయిగూడెం: మండల కేంద్రంలో తుడుందెబ్బ మండల కమిటీ ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆలం రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా రాయికంటి కిరణ్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొడెం రత్నం, యాసం రాజు, రాజబాబు, సోమరాజు, సమ్మయ్య, నర్సింహారావు, సర్వేశ్వర్‌రావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి



సారయ్య(ఫైల్)

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు మాచర్ల సారయ్య(57) అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్ నిమ్స్‌లో సోమవారం మృతి చెందాడు. ఆయన గతంలో నీటి సంఘం చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మృతిపై పలువురు నాయకులు, గ్రామస్తులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ములుగు రూరల్: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మల్లంపల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లంపల్లి గ్రామానికి చెందిన జంగం సురేశ్ (35) లారీ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. తల్లితండ్రులు ఇద్దరు గతంలో మృతి చెందారు. సురేశ్ సోదరుడు హనుమకొండలో అతడి కుటుంబంతో జీవిస్తున్నాడు. కాగా, ఆదివారం రాత్రి సమయంలో సోదరుడికి వీడియో కాల్ చేసి తనకు పెండ్లి కావడంలేదని జీవితంపై విరక్తిగా ఉందని చనిపోతున్నట్లు తెలిపాడు. మృతుడి సోదరుడు పక్కన వారికి ఫోన్ చేసి చెప్పగా అప్పటికే సురేష్ ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

పునఃనిర్మాణానికి ఏర్పాట్లు

- ప్రారంభించక ముందే గాలివానకు నేలకొరిగిన రుద్రమదేవి విగ్రహం
- సొంత ఖర్చులతో విగ్రహం ఏర్పాటు చేసిన చల్వాయి గ్రామవాసి



రుద్రమదేవి విగ్రహం లేక ఖాళీగా ఉన్న గద్దె

గోవిందరావుపేట: రాజ్యాలను ఏలిన మహారాణులలో రుద్రమదేవి ఒకరు. 35 ఏళ్ల పాటు కాకతీయ రాజ్యాన్ని పాలించింది. మండలంలోని లక్నవరం సరస్సు కాకతీయుల కాలంలోనే రూపుదిద్దుకోంది. కాకతీయులు నిర్మించిన ఈ సరస్సు ద్వారా మండల రైతులకు రెండు పంటలు పండుతాయి. మండల రైతులకు ఈ సరస్సు అద్భుతమైన వరం. దీంతో ఆమె గొప్పతనం తెలిసేలా మండలంలోని చల్వాయి గ్రామంలోని లక్నవరం క్రాస్ వద్ద వీరనారి రాణిరుద్రమ విగ్రహాన్ని చల్వాయి గ్రామానికి చెందిన సూరపనేని నాగేశ్వరరావు సొంత ఖర్చులతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కానీ ప్రారంభించకముందే రెండు సంవత్సరాల కిందట భారీగా వీచిన గాలివానలకు విగ్రహం నేలకొరగడంతో విగ్రహం పూర్తిగా ధ్వంసమైంది. దీంతో మళ్లీ సూరపనేని నాగేశ్వరరావు ముందుకు వచ్చి విగ్రహాన్ని తయారు చేయిస్తున్నాడు. దాదాపు రూ.15 లక్షల ఖర్చుతో విగ్రహాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. త్వరలోనే పునఃనిర్మాణం చేయనున్నట్లు పేర్కొన్నారు.



రెండు సంవత్సరాల క్రితం పడిపోయిన విగ్రహం



చల్వాయిలో లక్నవరం సరస్సు క్రాస్ వద్ద రుద్రమదేవి విగ్రహం(ఫైల్)

కాకతీయుల గుర్తుగా ఏర్పాటు చేశా..



సుమారు 15 లక్షల నా స్వంత ఖర్చులతో రాణిరుద్రమ విగ్రహాన్ని ఏర్పాటు చేశా. ప్రారంభం కాకముందే రెండు సంవత్సరాల కిందట బలమైన గాలులు వీచడంతో నేలకొరిగింది. మళ్లీ నిర్మించడానికి మరి కొంత వ్యయం చేయ్యాల్సి వస్తుంది. అది కూడా మరో మూడు నాలుగు నెలల్లో పూర్తి అవుతుంది. కాకతీయులు నిర్మించిన లక్నవరం చెరువుకు వెళ్లే దారిలో పౌరుషానికి ప్రతీక మహారాణి రుద్రమదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నా.

– నాగేశ్వరరావు, విగ్రహ ఏర్పాటుదారుడు

అభినందనీయం



కాకతీయుల వంశంలో ధ్రువతారగా వెలిగిన మహారాణి రుద్రమదేవి పౌరుషానికి ప్రతీక. ఆమె విగ్రహాన్ని చల్వాయి గ్రామంలో లక్నవరం క్రాస్ వద్ద ఏర్పాటు చేయడం అభినందనీయం. భవిష్యత్‌లో ఒక ల్యాండ్ మార్క్‌గా నిలిచిపోతుంది. మా మండల ప్రజలు లక్నవరం సరస్సు వల్లనే జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి చెరువును నిర్మించిన కాకతీయుల గుర్తుగా రుద్రమదేవి విగ్రహన్ని నిర్మించడం చాలా సంతోషమైన విషయం.

– ప్రకాశ్, చల్వాయి గ్రామనివాసి

సేవాలాల్ సేన పోరాటంతోనే రిజర్వేషన్లు



యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

- సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

ములుగు: సేవాలాల్ సేన పోరాట ఫలితంగానే 10 శాతం గిరిజన రిజర్వేషన్లను పొందడం జరిగిందని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు తెలిపారు. సోమవారం ప్రజా రగ్‌జోశ్ యాత్ర ములుగు జిల్లా అధ్యక్షుడు పోరిక రాహుల్ నాయక్ అధ్యక్షతన జిల్లాలోకి ప్రవేశించగా మల్లంపల్లి వద్ద ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సేవలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు మాట్లాడుతూ.. సేవాలాల్ సేన సాధించుకున్న విజయాలు చాలా ఉన్నాయని గిరిజన తండాలను, గూడాలను గ్రామ పంచాయతీలుగా సాధించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ప్రభుత్వ పాలకులు ఇచ్చిన ప్రతీ హామీని అమలు పర్చాలన్నారు. జీఓ నంబర్ 3ను పునరుద్దరించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో తొలి విడతగా నిర్వహిస్తున్న ప్రజా రగ్ జోశ్ యాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ నాయక్, రైతు విభాగ అధ్యక్షుడు బద్రు నాయక్, రవినాయక్, అజ్మీర రతన్ సింగ్, డేటావత్ పవన్ కుమార్, భూక్య జంపన్నతో పాటు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే గండ్ర చిత్రపటానికి క్షీరాభిషేకం

మొగుళ్లపల్లి: మండలానికి 108 వాహనం కేటాయించడానికి కృషి చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటానికి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బలహీన వర్గాల ప్రజల అభివృద్దే లక్ష్యంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు తక్కళ్లపల్లి రాజు, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మండ రవీందర్ గౌడ్, మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, టౌన్ ప్రెసిడెంట్ క్యాతరాజు రమేష్, వెంకటేశ్వర రెడ్డి, నరహరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా 3వ రోజు సోమవారం కొర్కిశాల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో తమ నిరసనలను తెలియజేశారు. 010 ద్వారా వేతనాలు ఇవ్వాలని, గత పీఆర్సీ నందు నష్టపోయిన వారికి నేషనల్ సర్వీస్ కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను నోటిఫికేషన్ ద్వారా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. ప్రిన్సిపాల్, రాకేశ్, ఉపధ్యాయులు వినయ్, కోటేశ్వర్, శ్యామ్, శ్రీకాంత్, అరుణ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ఆశవర్కర్లు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ.. నిర్వహించనున్న బస్సు జాతను విజయవంతం చేయాలని సీఐటీయూజిల్లా నాయకులు వెలిశెట్టి రాజయ్య, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్టు కొండ లక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బస్సు జాత వాల్‌పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు రూ.18,000 వేతనం అమలు చేయాలన్నారు. ఈ నెల 15న నిర్మల్ జిల్లాలో బస్సు జాత ప్రారంభమైందన్నారు. ఈనెల 30 వరకు వరకు అన్ని జిల్లాల్లో తిరిగి 31న ఇంద్రపార్క్ వద్ద సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్లు, యూనియన్ నాయకులు లక్ష్మి, కుమారి, నిర్మల, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



రామన్నగూడెం శివాలయంలో పుష్పాలతో అలంకరించిన శివలింగం



ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

- ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అభిషేకాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఉమా రామలింగేశ్వరస్వామి, రామన్నగూడెంలోని ఉమా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం శివుడు పుట్టిన జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయాల్లో పంచామృత అభిషేకాలను నిర్వహించారు. శివుడికి గోదావరి జలంతో జలాభిషేకం, బిల్వ పత్రాలతో ఆకుపూజలను అర్చకులు సాయిశర్మ, రాజ్‌కుమార్, పాపన్నలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, శివమాలధారులు, భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకొని శివలింగానికి పూజలు చేసి బస్మాభిషేకాలను చేపట్టారు. దీంతో ఆలయాలు భక్తులతో సందడిగా మారింది. ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆరుద్ర నక్షత్రం రోజు చేసే పూజలకు కలిగే ఫలితాలను పూజారులు భక్తులకు వివరించారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- పీసీసీ సభ్యుడు చల్లూరి మధు

భూపాలపల్లి రూరల్: మంత్రి శ్రీధర్ బాబుపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పీసీసీ సభ్యుడు చల్లూరి మధు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చల్లూరి మధుతో పాటు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, కాటారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబును విమర్శించే స్థాయి వెంకటరమణారెడ్డికి లేదన్నారు. భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి బీఆర్ఎస్ నాయకులకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా విమర్శలు మానుకోని అభివృద్ధికి సహకరించాలన్నారు. తమ నాయకులను విమర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవాన్, కౌన్సిలర్లు ముంజాల రవీందర్, శిరుప అనిల్, చల్లా రేణుక, కాంగ్రెస్ నాయకులు క్యాతరాజు సాంబమూర్తి, అంబాల శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు

రేగొండ: కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగే అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నర్సయ్య ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గూటోజు కిష్టయ్య మాట్లాడుతూ.. నిధులు మంజూరుకాకుండానే శంకుస్థాపనలు చేస్తున్నారనడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పున్నం రవి, పట్టెం శంకర్, షాబీర్ అలీ, వీరబ్రహ్మం, దేవేందర్. భిక్షపతి, తిరుపతి, రవిందర్ రెడ్డి, క్రాంతి, భాస్కర్, తరుణ్, స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త జంగం సురేశ్ మృతి చెందాడు. దీంతో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ సోమవారం జిల్లా కేంద్రంలో మార్చురీ గదిలో సురేశ్ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, శ్రీకాంత్‌రెడ్డి, శ్యామ్‌రావు, రవి, దేవేంద్రాచారి, మహేందర్, రాకేష్, లక్కి తదితరులు ఉన్నారు.

వైద్యం, విద్య, ఉపాధి కల్పించాలి

- ఏజెన్సీ దళిత సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్



దీక్షలో పాల్గొన్న నాయకులు

ఏటూరునాగారం: జిల్లాలోని అర్హులైన నిరుపేదలకు వైద్యం, విద్య, ఉపాధి కల్పించాలని ఏజెన్సీ దళిత సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పనపల్లి సుదర్శన్ అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని ఎంతో మంది పేదలు ఉపాధి లేక అలమటిస్తున్నారని, సరైన వైద్యం, విద్య లేక జీవితాలు అంధకారంలోకి నెట్టబడుతున్నాయన్నారు. ప్రభుత్వాలు ఉచిత పథకాల పేరు చెప్పి హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల సుమన్, తరుణ్, సురేష్, మనోహర్, చరణ్, రాజశేఖర్, రాజు, చిరంజీవి, ఆనంద్, నాగేష్, విజయ్, శ్రీరామ్, నరేష్, అజయ్ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని గొనెపల్లిలో పాస్టర్ జ్యోతిరాణి ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రవీణ్ తైదల, జోసెఫ్, మోషే, ఈసం రమేష్, క్రైస్తవులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న పాస్టర్లు

ఆదివాసీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని విద్యా సంస్థల్లో సీఆర్‌టీల ఉద్యోగాలను ఆదివాసీల అభ్యర్థులతోనే భర్తీ చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిశె బాలకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో సీఆర్‌టీల నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. జీఓ 57 ప్రకారం షెడ్యూల్ ఏరియాలో ఉన్న అన్ని ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను స్థానిక అర్హత కలిగిన ఆదివాసీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి మాట్లాడుతూ..షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగాలు ఆదివాసీల హక్కు అన్నారు. తుడుందెబ్బ నాయకులు పొడెం బాబు, పాపారావు, నాగేశ్వర్‌రావు, ఆలం నగేష్, సంతోష్, సులోచన, శమంతకమణి పాల్గొన్నారు.

బస్సు సర్వీస్ కొనసాగించాలి

- సీపీఎం నాయకుడు రవిగౌడ్



సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ములుగు రూరల్: అంకన్నగూడెం గ్రామానికి గతంలో లాగానే బస్సు సర్వీస్‌లను కొనసాగించాలని సీపీఎం నాయకుడు గుండబోయిన రవిగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని సర్వాపూర్‌లో గ్రామస్తులు నిరసన తెలిపి ఆర్టీసీ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వరంగల్-2 డిపో బస్సు హనుమకొండ నుంచి అంకన్నగూడెం సర్విస్ నడిపించారని తెలిపారు. ప్రస్తుతం పరకాల డిపోకు బదిలీ చేయడంతో అంకన్నగూడెం నుంచి నేరుగా హనుమకొండకు వెళ్లె ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాత పద్ధతిలోనే నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండమీది వెంకటేశ్వర్లు, సాంబయ్య, వెంకటనర్సు, తిరుపతి, నర్సయ్య, అనసూర్య, ప్రమీల , సమ్మయ్య, సారయ్య, విమల, రమాదేవి పాల్గొన్నారు.

ఆదాయ పన్నుతో నష్టం

- సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి రాజయ్య



కార్మికులతో మాట్లాడుతున్న రాజయ్య

భూపాలపల్లి రూరల్: ఆదాయ పన్ను భారంతో సింగరేణి కార్మికులు నష్టపోతున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య అన్నారు. సోమవారం వివిధ గనుల్లో కార్మికులను కలుసుకొని రాజయ్య మాట్లాడారు. ఆదాయపు పన్ను భారంతో నష్టపోతున్న కార్మికులకు కంపెనీలో క్వార్టర్ తీసుకుంటే క్వార్టర్ అద్దె, కరెంటు, నీరు, గ్యాస్ బిల్లులతో కలిపి అదనపు ఆదాయాన్ని చూపుతూ.. యాజమాన్యం మరింత భారం వేస్తున్నదని దీనివలన కార్మికులు మరింత ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. యూనియన్లతో పాటు అసెంబ్లీ ఎన్నికలలో అన్ని పార్టీలు ఆదాయ పన్ను రద్దు చేయిస్తామని హామీ ఇచ్చాయని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించి కార్మికులకు ఈ ఒప్పందాన్ని అమలుచేసేలా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనితోపాటే మారుపేర్లతో అనేకమంది కార్మికులు విజిలెన్స్ పెండింగ్ కేసులతో ఇబ్బంది పడుతున్నందున ఈ సమస్యకు పరిష్కారం చూపేలా కార్మిక సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం

- కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం అభిస్తుందని కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 16వవార్డు రాంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యసం, బాలమృతం పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పిల్లల తల్లులు, గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషకపదార్థాలను క్రమం తప్పకుండా వాడితే పిల్లల్లో ధృడత్వంతోపాటు ఉల్లాసంగా ఉంటారన్నారు. సీడీపీఓగా మల్లీశ్వరి సూపర్వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్ అరుణ, పిల్లలతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944